క్లుప్తంగా

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



మిడ్జిల్: స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వార్డు మెంబర్, సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ అన్ని స్థానాలకు బీజేపీ అ భ్యర్థులు పోటీలో ఉంటారని, ప్రతికార్యకర్త దేశంలో నరేంద్ర మోదీ చేపట్టిన అభివృద్ధి పథకాలను వివరించి ఓట్లు అడగాలని సూచించారు.సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, మండలాధ్యక్షుడు నరేశ్‌నాయక్, వెంకట్, శేఖర్‌రెడ్డి, బేగం, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఉర్దూఘర్‌ను వేరే ప్రాంతానికి తరలించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కళాభవన్ ఆవరణలో నిర్మించ తలపెట్టిన ఉర్దూఘర్‌ను వేరే ప్రాంతానికి తరలించాలని అంబేద్కర్ కళాభవన్ పరిరక్షణ సమితి జేఏసీ ఉమ్మడి జిల్లా చైర్మన్ సింగిరెడ్డి పరమేశ్వర్‌మాదిగ కోరారు. మంగళవారం కలెక్టరేట్ ఏఓ సువర్ణరాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీల అభివృద్ధికి ఎస్సీలకు కేటాయించిన స్థలంలో ఉర్దూఘర్ నిర్మించడం సరికాదని తెలిపారు. అంబేద్కర్ కళాభవన్ ఆవరణలో ఆడిటోరియం నిర్మాణం చేసుకుని ఇప్పుడిప్పుడే ఎదుగుతున్నామని.. అలాంటి స్థలంలో ఉర్దూఘర్ నిర్మాణం చేపడితే మాకు అన్యాయం జరుగుతుందన్నారు.ఉర్దూగర్‌కు పట్టణంలోని ఎక్కడైనా ప్రభుత్వ స్థలంలో కాని వక్ఫ్ బోర్డు భూముల్లో నిర్మాణం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో అంబేద్కర్ కళాభవన్ పరిరక్షణ సమితి అధ్యక్షుడు పాతూరి రమేష్, కృష్ణయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కొల్లూర్ పంచాయతీని ఎస్సీకి కేటాయించాలి



నవాబుపేట: కొల్లూర్ పంచాయతీని ఎస్సీకి రిజర్వు చేయాలని గ్రామానికి చెందిన ఎస్సీ నాయకులు, ప్రజలు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. తాజాగా వెలువడిన పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లలో కొల్లూర్ ఎస్టీలకు రిజర్వు చేయబడింది. దీంతో వారు మంగళవారం మండల కేంద్రంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ జయరాంనాయక్‌లకు వినతి పత్రం అందించి తమ గోడును వెల్లబోసుకున్నారు. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి గ్రామం ఎస్సీలకు రిజర్వు కాలేదని కాని ఉమ్మడి జీపీలో గిరిజన తండాలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పడ్డ కొల్లూర్‌కు ఉన్న ఒకే తండాను దృష్టిలో ఉంచుకుని వారికి రిజర్వు చేశారని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో ఆర్‌డీఓ నవీన్‌కుమార్‌కు సైతం తమ డిమాండ్‌ను వివరించి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కొల్లూర్ నాయకులు పోచయ్య, బాలకిష్టయ్య, నరేశ్, జగన్, ఆంజనేయులు, యాదయ్య, రాములు, బాలయ్య, జగన్‌మోహన్, అంజయ్య, పూర్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బతుకమ్మ సంబురాలు



నవాబుపేట: బతుకమ్మ సంబురాలు మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా సిబ్బంది బతుకమ్మలతో ఆడిపాడి ఆలరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, డీటీ సువర్ణ, ఆర్‌ఐ గాయిత్రీ, రామాంజనేయులు ఉన్నారు.

వేరుశనగ విత్తనాల పంపిణీ

జడ్చర్ల: మండలంలోని పెద్ద ఆదిరాల రైతువేదిక వద్ద రైతులకు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసిన వేరుశనగ విత్తనాలను మంగళవారం మండల వ్యవసాయ శాఖ అధికారి గోపీనాథ్ పంపిణీ చేశారు. జాతీయ నూనె గింజల పథకం కింద ఒక్కో రైతుకు 80 కేజీ వేరుశనగను అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు సంతోష్, భవానీ, రైతులు పాల్గొన్నారు.



అద్దె భవనాల్లో పాలన!



రాజాపూర్ మండల కేంద్రంలో ప్రైవేటు భవనంలో కొనసాగుతున్న పోలీస్‌స్టేషన్

- కార్యాలయాల నిర్మాణానికి జాగా కరువు
- సర్కారు స్థలాల్లేక మొదలుకాని పక్కా భవనాలు
- మండలంలో అన్ని ఆఫీసులకు అద్దె భవనాలే దిక్కు

రాజాపూర్: పరిపాలన సౌలభ్యం కోసం అప్పటి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొత్తజిల్లాలు, కొత్తమండలాలు ఏర్పాటు చేసింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారం కోల్పోయి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు అయినా కొత్తగా ఏర్పాటైన రాజాపూర్ మండలంలో ప్రభుత్వ కార్యాలయాల కోసం పక్కా భవనాలు నిర్మించాలంటే ఎక్కడా అనువైన స్థలం లేకపోవడంతో అద్దె భవనాలే దిక్కయ్యాయి. మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంతో పాటు పోలీస్‌స్టేషన్, మండల పరిషత్ కార్యాలయం, ఎంఈఓ, వెలుగు(ఐకేపీ) విద్యుత్‌శాఖ ఏఈ కార్యాలయం ఇలా.. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చినప్పటికీ ఎక్కడా అనువైన స్థలం, ప్రభుత్వ స్థలం లేదు. దీంతో ప్రస్తుతం కొనసాగుతున్న ఈ భవనాల ఓనర్లు అద్దెలు ప్రతినెలా రాకపోవడంతో అధికారులను అద్దెకోసం ఇబ్బందులకు గురిచేస్తు న్నారు. ఇచ్చేది తక్కువ.. అదికూడా ఆరునెలలు, ఏ డాదికి అద్దె వస్తుండడంతో తమ ఇండ్ల నుంచి కార్యాలయాలను ఖాళీ చేయాలని ఇంటి యజమానులు అధికారులపై ఒత్తిడి చేస్తున్నారు. దీంతో రాజాపూర్ మండలంలో పనిచేస్తున్న అధికారులు ఉన్నతాధికారులకు సమాధానం చెప్పలేక ఇంటి యజమానులు ఇబ్బందులకు సతమతమవుతున్నారు.

- మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్‌కు స్థలం లేకపోవడంతో ముదిరెడ్డిపల్లి వద్ద జాతీయ రహదారిపై గతంలో ఓ ఆర్మీ అధికారికి ఇచ్చిన ఎకర స్థలాన్ని పోలీస్ స్టేషన్ నిర్మాణానికి కేటాయించారు. మండలకేంద్రానికి దూరం కావడంతోపాటు ఎకర స్థలంలో సరిపోదని పోలీస్‌స్టేషన్ పక్కా భవనం ఫైల్ ఎక్కడవేసిన గొంగడి అక్కడే చందంగా మారింది.
- ప్రస్తుతం ఉన్న తహసీల్దార్ కార్యాలయం అద్దె సక్రమంగా ఇవ్వడంలేదని గతకొన్ని నెలల కిందట రెండుమూడు పర్యాయాలు తాళం వేసిన ఘటన కూడా ఉంది.
- రాజాపూర్‌లో తహసీల్దార్ కార్యాలయానికి, పోలీస్‌స్టేషన్ భవనాల నిర్మాణానికి స్థలం ఉంటే వెంటనే పక్కా భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి తీసుకొస్తానంటూ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఎన్నోసార్లు సమావేశాల్లో పేర్కొన్నారు. గతంలో కొన్ని వెంచర్లలో జీపీకి రావాల్సిన 10శాతం భూమిని కేటాయిస్తున్నట్లు గతంలో నాయకులు తెలిపారు. అయితే ఇటీవల ఓ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజాపూర్‌లో స్థలం లేకుంటే రంగారెడ్డి గూడలో ఉన్న ప్రభుత్వ భూమిలో పోలీస్‌స్టేషన్, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలను నిర్మిస్తామని తెలిపారు.



ప్రైవేటు భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం

అద్దె లేటవడంతో ఇబ్బందులు



ప్రస్తుతం ఉన్న తహసీల్దార్ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతున్నది. ప్రతినెలా రూ.15,680. ఇప్పటికీ 9నెలల అద్దె చెల్లించాల్సి ఉంది. బిల్లు తయారు చేసి మంజూరుకు కలెక్టరేట్‌కు పంపించాం. వచ్చిన వెంటనే ఓనర్‌కి చెల్లిస్తాం.

– రాధాకృష్ణ, తహసీల్దార్, రాజాపూర్ మండలం

భవనాలు నిర్మిద్దామంటే స్థలం లేదు



కొత్తగా ఏర్పాటైన రాజాపూర్ నాసొంత మండలం. తన పదవీకాలంలో ప్రభుత్వ కార్యాలయాలన్నింటికి నిధులు తీసుకొచ్చి పక్కా భవనాలు నిర్మించాలనే ఆలోచన ఉంది. మండల కేంద్రంలో ప్రభుత్వ భూమి ఎక్కడా లేదు. ప్రైవేటు భూమి కొనుగోలు చేయాలంటే రూ.కోట్లు కావాలి. రంగారెడ్డిగూడలో ప్రభుత్వ భూమి ఉంది. ఎక్కడా దొరక్కుంటే రంగారెడ్డి గూడలో నిర్మిస్తాం.

– అనిరుధ్‌రెడ్డి, ఎమ్మెల్యే జడ్చర్ల

రిషి పూర్వ విద్యార్థికి డీఎస్పీ ఉద్యోగం



సౌమ్యను సన్మానిస్తున్న యాజమాన్యం చంద్రకళావెంకటయ్య

- పూర్వ విద్యార్థిని అభినందించిన యాజమాన్యం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని రిషి పాఠశాల పూర్వ విద్యార్థి డి.సౌమ్య ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన టీజీపీఎస్సీ గ్రూప్–1 ఫలితాల్లో డీఎస్పీగా ఎంపికయ్యారు. ఈ మేరకు పాఠశాల యాజమాన్యం ఆమెతోపాటు వారి తల్లిదండ్రులు సులోచన, గిరివర్ధన్‌ను ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యాజమాన్యం చంద్రకళావెంకటయ్య మాట్లాడుతూ.. తమ పాఠశాలలో సౌమ్య 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివి డీఎస్పీగా ఎంపికకావడం చాలా గర్వించదగ్గ విషయమన్నారు. క్రమశిక్షణతో చదివిన విద్యార్థులు తప్పకుండా జీవితంలో ఉన్నతంగా ఎదుగుతారని సౌమ్య నిరూపించిందని, ప్రస్తుతం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు కూడా ఆమెను ఆదర్శంగా తీసుకుని ఎక్కువ సమయం చదువులకే కేటాయించాలని, మంచి మార్కులు సాధించాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్‌లు శిరీషాప్రవీణ్‌కుమార్, పూజితామోహన్‌రెడ్డి, సుశాంత్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే ఆల జన్మదిన వేడుకలు



భూత్పూర్‌లో కేక్‌కట్ చేసి తినిపించుకుంటున్న బీఆర్‌ఎస్ నాయకులు

భూత్పూర్/అడ్డాకుల: పట్టణంలోని చౌరస్తాలో మంగళవారం దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి సంబురాలు జరుపుకొన్నారు. కేక్‌ను కార్యకర్తలకు ఒకరికొకరు తినిపించుకున్నారు. అనంతరం అమిస్తాపూర్‌లోని సాక్షి గణపతి ఆలయంలో దుర్గామాతను ఆల శ్రీకాంత్‌రెడ్డి, మండడి సరోజ్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్‌గౌడ్, నాయకులు మురళీధర్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, నర్సింహులుగౌడ్, రాములురాథోడ్, సత్యనారాయణ, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే మూసాపేట, అడ్డాకుల మండల కేంద్రాల్లో బీఆర్‌ఎస్ నాయకులు కేక్ కట్‌చేసి ఆస్పత్రుల్లో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. కందూర్ చెక్‌డ్యాం వద్ద కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దవాగుకు పోటెత్తిన వరద



కందూర్ స్టేజీ వద్ద పెద్దవాగులో పారుతున్న వరద నీళ్లు

అడ్డాకుల: మూసాపేట, అడ్డాకుల మండలాల్లో విస్తరించి ఉన్న పెద్దవాగుకు మంగళవారం ఉదయం నుంచి భారీ వరద పోటెత్తింది. సోమవారం రాత్రి ఎగువ ప్రాంతంలో వర్షం కురవడంతో వాగుకు వరద పెరిగింది. రెండు మండలాల్లోని వాగులో నిర్మించిన చెక్‌డ్యాంలు నిండుగా ప్రవహిస్తున్నాయి. సుమారు నెల రోజులుగా వాగులో వరద నీళ్లు పారుతున్నాయి. రెండు మండలాల్లోని వాగులో ప్రవహిస్తున్న వరద నీళ్లు దిగువన్న ఉన్న వనపర్తి జిల్లా మదనాపురం మండలం శంకరమ్మపేట వద్ద ఉన్న సరళాసాగర్ ప్రాజెక్టుకు చేరుతున్నాయి. ఇప్పటికే సరళాసాగర్ నిండుకుని సైఫన్లు తెరుచుకున్నాయి. తాజాగా పెద్దవాగుకు భారీ వరద సరళాసాగర్‌కు పోటెత్తుతోంది.



పొన్నకల్, నందిపేట మధ్యన అలుగు నీళ్ల ఉధృతి

నిలిచిన రాకపోకలు

అడ్డాకుల: మండలంలోని పొన్నకల్ నల్ల చెరువు అలుగు పారుతుండడంతో నందిపేట, పొన్నకల్ మధ్య రాకపోకలు నిలిచి పోయాయి. నల్ల చెరువు నీళ్లు చెరువు కట్ట వద్ద బీటీరోడ్డుపై పెద్ద ఎత్తున పారుతున్నాయి. నీటి ఉధృతికి నందిపేటకు వాహనాలు వెళ్లడానికి వీలు లేకుండా మారుతోంది. ద్విచక్రవాహనాలు, కార్లు రోడ్డు దాటి వెళ్లే పరిస్థితి లేదు. రెండు, మూడు రోజులుగా తరచూ రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుండగా సోమవారం రాత్రి కురిసిన వర్షానికి వరద పెరిగి మంగళవారం రాకపోకలు పూర్తిగా నిలిచాయి. అదేవిధంగా ఇదే అలుగు నీళ్లు కొద్దిదూరం తర్వాత రాచాల రోడ్డుపై పారుతున్నాయి. ఇక్కడ కూడా బైకులు, ఆటోలు అతికష్టం మీద రోడ్డు దాటుతున్నాయి. నందిపేట గ్రామస్తులు దాసర్‌పల్లి, మూసాపేట మీదుగా హైవేకు చేరుకుంటున్నారు. ఇక్కడ అలుగు నీళ్లు పారేచోట బ్రిడ్జి నిర్మాణం చేయిస్తే సమస్య తీరుతుందని వాహనదారులు చెబుతున్నారు.

మాజీ మంత్రి పరామర్శ

జడ్చర్ల: మండలంలోని ఆల్వాన్‌పల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు శంకరయ్య మంగళవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి మృతిపై కేసు నమోదు

నవాబుపేట: మూర్ఛరోగంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని ఊరంచుతండాలో చోటు చేసుకుంది. ఊరంచుతండాకు చెందిన కెతావత్ సోమ్లునాయక్(52)సోమవారం ఎప్పటిలాగా కూలీ పనికి వెళ్లాడు. గ్రామ సమీపంలోని వ్యవసాయ బోరు చెంత నీళ్లుతాగేందుకు వెళ్లి బోర్లాపడి అక్కడే మృతిచెందాడు. మూర్ఛరావడంతో మృతిచెంది నట్లు మృతుడి భార్య సుగుణ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు.

ఎన్నికల ఖర్చులపై అవగాహన

రాజాపూర్: స్థానిక ఎన్నికల కోడ్ నియమావళి ప్రకారం ఎన్నికల్లో పోటీలో నిలబడే అభ్యర్థులకు మోడల్‌కోడ్‌తోపాటు ఎన్నికల ఖర్చులు, వివరాలపై బుధవారం ఉదయం 10గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులు హాజరుకావాలని పేర్కొన్నారు.

నేడు రూ.14కోట్ల పనులకు శంకుస్థాపన

జడ్చర్ల: పట్టణంలో రూ.14 కోట్ల వ్యయంతో చేపట్టనున్న వరద కాల్వల నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్‌యాదవ్ ప్రకటనలో తెలిపారు.

ఎన్నికల కోడ్ పాటించాలి

నవాబుపేట: ఎన్నికల కోడ్ అమలులో ఉందని.. ఎవరూ నిబంధనలు మీరి ప్రవర్తించరాదని తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ జయరాంనాయక్ తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికలకు సంబంధించి కోడ్ అమలులో ఉందని దీన్ని అందరూ పాటించాలన్నారు. రాజకీయ వేదికలకు ప్రత్యేక అనుమతులు తీసుకుని కార్యక్రమాలు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. అలాగే నగదు రవాణా విషయంలో నిబంధనలకు మించి నగదును తీసుకురాకూడదని ఎస్‌ఐ విక్రమ్ సూచించారు.

ఆర్టీసీ డ్రైవర్‌కు చేయూత

స్టేషన్ మహబూబ్‌నగర్: అనారోగ్యంతో బాధపడుతున్న స్థానిక ఆర్టీసీ డిపోకు చెందిన డ్రైవర్ రామస్వామికి తోటి కార్మికులు, ఉద్యోగులు అండగా నిలిచారు. మంగళవారం రూ.32,200ల ఆర్థిక సాయాన్ని డిపో మేనేజర్ సుజాత చేతుల మీదుగా అందించారు.

మట్టి అక్రమ తరలింపును ఆపండి

దేవరకద్ర రూరల్: వారం రోజులుగా మీన్గునిపల్లిలోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా జరుగుతున్న మట్టి తరలింపును నిలిపివేయాలని జలంధర్‌రెడ్డి అనే వ్యక్తి మంగళవారం ఇన్‌ఛార్జ్ తహసీల్దార్ దీపికకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని సర్వే నెంబర్ 125లో ప్రకృతివనంకు దగ్గర ఉన్న భూమిలో గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఇందిరమ్మ ఇంటి నిర్మాణాల పేరుతో ఎలాంటి అనుమతి లేకుండా మట్టిని బయటకు తరలిస్తూ అమ్ముకుంటున్నారని, అడ్డుకోబోయిన మాపై దౌర్జన్యం చేస్తున్నాడని తెలిపారు. ఈ విషయంపై గతంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రత్యేక శిబిరాలతో మహిళలకు ఉపయోగం



నవాబుపేట ఆస్పత్రిలో వివరాలు ఆరా తీస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

నవాబుపేట: స్వస్థ్‌నారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో చేపట్టిన ప్రత్యేక వైద్య శిబిరాలు మహిళలకు చాలా ఉపయోగపడుతాయని కలెక్టర్ విజయేందిర బోయి పేర్కొన్నారు. మంగళవారం ఆమె మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో నిర్వహిస్తున్న మహిళా ప్రత్యేక వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా క్యాంపునకు వస్తున్న వారి వివరాలు ఎక్కువగా వస్తున్న వ్యాధిగ్రస్తుల వివరాలపై ఆరా తీశారు. అలాగే ప్రత్యేకంగా వైద్యం అందించేందుకు వచ్చిన నిపుణులతో తాజాగా ఇక్కడి పరిస్థితులు, సీజనల్‌వ్యాధులపై వివరాలు తెలుసుకున్నారు. కాగా డెంగీ, షుగర్‌వ్యాధులపై ప్రత్యేక పరీక్షలు ఈ శిబిరంలో నిర్వహిస్తున్న విషయం అందరూ గమనించాలని సూచించారు. కాగా ఈ శిబిరం ఈనెల 17నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు కొనసాగుతుండగా.. వాటికి వచ్చిన కేసుల వివరాలు, జిల్లా కేంద్రానికి రెఫర్ చేసిన కేసుల వివరాలు ప్రత్యేకంగా నమోదు చేయాలని సూచించారు. నవాబుపేట పీహెచ్‌సీలో ప్రసవాలు అధిక సంఖ్యలో ఉండేవని తాజాగా కొంత తగ్గినట్లు ఆమె వివరించారు. ఈ విషయంలో సిబ్బంది మరింతగా పనిచేసి రికార్డు స్థాయిలో ఉండాలన్నారు. ప్రసవాలు మొత్తం వందశాతం ప్రభుత్వ ఆస్పత్రిలోనే జరగాలని సూచించారు. అనంతరం ఆస్పత్రిలో ఇటీవల ప్రసవించిన బాలింతను ఆస్పత్రి చికిత్సల వివరాలు స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఆమెవెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శశికాంత్, మండల వైద్యాధికారి శ్రావణ్‌కుమార్, శ్రీనివాస్, రాఘవేందర్, రాములు తదితరులు ఉన్నారు.

ఆదివాసీ ఎరుకల సమస్యల పరిష్కారానికి కృషి



విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్: ఆదివాసీ ఎరుకల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కళా భవన్‌లో ఆత్మగౌరవ పోరాట జెండా పండుగ సందర్భంగా ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ఏకలవ్యుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎరుకల ఆత్మగౌరవ పోరాట జెండాను ఆవిష్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పిల్లలకు మంచి భవిష్యత్ కావాలంటే వారికి మంచి చదువును అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అలాగే ప్రతిఒక్కరు ఏదైనా స్కిల్స్‌లో నైపుణ్యం కలిగి ఉండాలని సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా స్కిల్స్ కలిగిన మ్యాన్ పవర్ కొరత ఉందని, మనం స్కిల్స్‌లో ప్రావీణ్యం సంపాదిస్తే భవిష్యత్ మనదేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి విద్యానిధి నుంచి చేయూత

స్టేషన్ మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించిన పయనీర్ కార్యక్రమం ద్వారా విద్యార్థి మహాలక్ష్మి ఎప్‌సెట్‌కు కోచింగ్ తీసుకొని 12362 ర్యాంక్ పొంది మూడో పీజీ కౌన్సిలింగ్‌లో ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో సీటు సాధించింది. విద్యార్థిని తండ్రి ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో ఫీజు కూడా కట్టుకోలేని స్థితిలో కుటుంబం ఉందని ఆమె ఎమ్మెల్యేకు విన్నవించింది. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే విద్యానిధి నుంచి అగ్రికల్చర్ యూనివర్సిటీ మొదటి సెమిస్టర్ ఫీజును రూ.62,500ల చెక్కును క్యాంపు కార్యాలయంలో అందజేశారు. పట్టుదలతో చదివి జీవితంలో స్థిరపడాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు మనోహర్, బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భగవంతాచారి పాల్గొన్నారు.

దిగుడు మెట్లను పొడిగించాలని వినతి



ఆలయ చైర్మన్, ఈఓకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

చిన్నచింతకుంట: కురుమూర్తి స్వామి ఆలయ దిగుడు మెట్లను పొడిగించి భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్వరమేశ్ కోరారు. మంగళవారం కురుమూర్తి స్వామి ఆలయ దిగుడు మెట్లను పొడిగించాలని కోరుతూ.. ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈఓ మదనేశ్వర్‌రెడ్డికి పార్టీ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు, అమావాస్యను పురస్కరించుకొని భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తారని, స్వామివారి దర్శనానికి వెళ్లే భక్తులు, దిగివచ్చే భక్తులకు రాజగోపురం వద్దనే దారి ఉండడంతో భక్తులు రద్దీగా పెరిగి తీవ్ర ఇబ్బందులకు గురవుతారన్నారు. అందుకు అధికారులు రాజగోపురం నుంచి దిగుడు మెట్లను ఈఓ కార్యాలయం వెనుక భాగం వరకు పొడిగించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకృష్ణ, కృష్ణయ్య, మల్లేశ్, వినోద్‌కుమార్, మాసన్న, శంకర్, సతీశ్, వెంకటేశ్, సాయి పాల్గొన్నారు.

ముగిసిన భజన పోటీలు

చిన్నచింతకుంట: దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని కురుమూర్తిలోని వీరాంజనేయ భజన మండలి ఆధ్వర్యంలో దుర్గా మాత మండపం వద్ద సోమవారం సాయంత్రం నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి భజన పోటీ లు మంగళవారం ముగిశాయి. ఈ పోటీలో కొందర్గ భజన మండలి మొదటి విజేత, గంగాపురం భజన మండలి రెండో విజేత, దుప్పల్లి భజన మండలి మూడో విజేత, చిన్నకడుమూర్ భజన మండలి నాలుగో విజేతగా నిలిచారు. మొదటి బహుమతి 10, 016, రెండో బహుమతి 6, 016, మూడో బహుమతి 4,016, నాలుగో బహుమతి 2,016తోపాటు షీల్డులు అందజేశారు.



అండర్ బ్రిడ్జిలో నడిచేదెలా..?



అడ్డాకుల: మూసాపేట మండలం కొమిరెడ్డిపల్లిలో 44వ నంబర్ జాతీయ రహదారి వద్ద ఏర్పాటు చేసిన అండర్ బ్రిడ్జిలో వర్షం నీళ్లు నిలుస్తున్నాయి. దీనివల్ల అండర్ బ్రిడ్జిలో రాకపోకలకు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం మొదలైన నాటినుంచి ఇదే పరిస్థితి నెలకొంది. అండర్ బ్రిడ్జిలో నిలిచే నీళ్లు ముందుకు వెళ్లే కాల్వ ఎత్తులో ఉండడంతో నీళ్లు నిలుస్తున్నాయి. వృద్ధులు, చిన్నపిల్లలు బ్రిడ్జిలోంచి నడిచి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా రహదారి నిర్వాహకులు స్పందించి అండర్ బ్రిడ్జిలో నీళ్లు నిలువకుండా తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరముంది.

దుర్గాదేవిగా భక్తులకు దర్శనం



ఈశ్వర వీరప్పయ్య స్వామి పూజలందుకున్న దుర్గాదేవి



దేవరకద్రలో దుర్గాదేవి అలంకారంలో వాసవీమాత

దేవరకద్ర: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం తొమ్మిదో రోజు అమ్మవారిని దుర్గాదేవి రూపంలో అలంకరించి ఘనంగా పూజలు నిర్వహించారు. దేవరకద్ర ఈశ్వర వీరప్పయ్య స్వామి, కన్యకాపరమేశ్వరి, ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయాలు, దళితవాడలో దుర్గామాత పూజలు ఘనంగా నిర్వహించారు. లక్ష్మీపల్లిలోని కనకదుర్గా ఆలయంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు.

బతుకమ్మ వేడుకలు

దేవరకద్ర మండల కేంద్రంలోని ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద మంగళవారం రాత్రి బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, యువతులు, చిన్నారులు పెద్ద ఎత్తున తరలివచ్చి బతుకమ్మలతో ఆడిపాడారు.

అష్టలక్ష్మిదేవీగా అలంకరణ

రాజాపూర్: శరన్నవరాత్రుల్లో భాగంగా మంగళవారం రాజాపూర్ మండల కేంద్రంతోపాటు పరిధిలోని రంగారెడ్డిగూడ చొక్కంపేట, తిర్మలాపూర్ తదితర గ్రామాల్లో అమ్మవారు అష్టలక్ష్మి అలంకరణలో భక్తులతో పూజలందుకున్నారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి కుంకుమార్చన చేశారు.రంగారెడ్డిగూడలో శివప్రసాద్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు